ప్రజాశక్తి
సోమవారం 28 ఆగస్టు 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

డెల్టాలో వరినాట్లు ముమ్మరం

పొన్నూరు వద్ద ఎదుగుదల దశలో వరి పైరు

- చివరిదశకు ఖరీఫ్ సాగు
- కాల్వలకు పట్టిసీమ నీరు
- పులిచింతలలో గణనీయంగా తగ్గిన నీటినిల్వ
- పత్తి, మిర్చి రైతుల్లో అయోమయం

ప్రజాశక్తి -గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సాగు కొంత మేరకు ఊపందుకుంది. పల్నాడు జిల్లా కంటే గుంటూరు జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా ఉండటం, కాల్వలకు అవసరం మేరకు నీరు రావడం వల్ల వరినాట్లు ఊపందుకున్నాయి. జిల్లాలో 3.25 లక్షల ఎకరాల్లో పంటలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటివరకు 1.85 లక్షల ఎకారాల్లో వివిధ రకాల పైర్లు వేశారు. 1.66 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేయగా ఇప్పటివరకు 1.25 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇందులో దాదాపు 95 వేల ఎకరాల్లో వెదపద్ధతిలో సాగు చేయగా 30 వేల ఎకరాల్లోనే సాధారణ నాట్లు పద్ధతిలో సాగు చేశారు. ఇంకా 40 వేల ఎకరాల్లో వరి సాగుచేయాల్సి ఉందని అధికారవర్గాలు తెలిపాయి. పత్తి సాగు 76 వేల ఎకరాలకు గాను 42 వేల ఎకరాలు, మిర్చి 40 వేల ఎకరాలకుగాను 10 వేల ఎకరాల్లో సాగు చేశారు. మరో 8 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు.

తాడికొండ, పెదనందిపాడు, మేడికొండూరు, ఫిరంగిపురం, కాకుమాను, వట్టిచెరుకూరు తదితర మండలాల్లో చాలినంత వర్షాలు లేకపోవడంతో మిర్చి, పత్తిసాగు ఇంకా ఊపందుకోలేదు. సాగర్ ఆయకట్టు పరిధిలో ఈఏడాది నీరు విడుదల చేస్తారని హామీ లేకపోవడంపై మిర్చి సాగు అంశంలో రైతులు తటపటాయిస్తున్నారు. డెల్టాకు పట్టిసీమ నుంచి నీరు వస్తుండటంతో కొంత మేరకు పరిస్థితి ఆశాజనకంగా ఉంది. దీంతో రైతులు వరి సాగుకు సమాయత్తం అయ్యారు. డెల్టాకు మాత్రమే ఉపయోగపడే పులిచింతల జలాశయంలో కూడానీటి నిల్వ గణనీయంగా తగ్గిపోయింది. పులిచింతల గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ఆదివారం నాటికి 23.09 టిఎంసిల నిల్వ ఉంది. అయితే గతేడాది ఆగస్టు 27 నాటికి 39.22 టిఎంసిల నీరు నిల్వ ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గుంటూరు ఛానల్‌కు 64 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

డెల్టాకు ప్రస్తుతానికి నీటి ఎద్దడి లేకున్నా వరి పైరు పొట్టదశకు వచ్చే సమయానికి వర్షాలు లేకపోతే పులిచింతల నుంచి నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. అప్పటికి ఎగువనుంచి వరద ప్రవాహం రాకపోతే కొంత ఇబ్బంది రావచ్చునని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పట్టిసీమ నుంచి గోదావరి జలాలు రావడంవల్ల ఈఏడాది కృష్ణాడెల్టాలో వరి

▶ 2లో

5 లో
తాడేపల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాశం రామారావు తదితరులు

ప్రజా వ్యతిరేక విధానాలపై 30 నుండి నిరసనలు

- జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ, ప్రచారం
- ఆందోళనల్లో పాల్గొనాలని ప్రజలకు సిపిఎం పిలుపు

విద్యుత్ భారం.. సోలార్‌తో దూరం

- సొమ్ముచెల్లించిన వెంటనే కనెక్షన్లు
- ప్రజాశక్తితో నెడ్ క్యాప్ జిఎం యర్రంరెడ్డి

8 లో

హాస్టల్ పరిసరాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

విద్యార్థినులతోపాటు కలెక్టర్ భోజనం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వసతి గృహంలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం ఆహారం అందించాలని, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. నరసరావుపేట సమీపంలోని లింగంగుంట్ల పరిధిలో గల ఎపి మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9, 10వ తరగతి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ః ఆధునిక యుగంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, విద్యార్థినులు దీన్ని గమనించి ఆత్మన్యూనతా భావాన్ని వదిలేయాలని సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో సాధించాలన్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు.

వేసవిని తలపిస్తున్న ఎండ

రెంటచింతలలో 37.5 డిగ్రీల ఉష్ణాగ్రత

ప్రజాశక్తి - రెంటచింతల

వర్షాకాలమైనా వర్షాలు లేకపోవడంతోపాటు వాతావరణం మండు వేసవిని తలపిస్తోంది. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతూ అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పల్నాడు జిల్లాలోని మండల కేంద్రమైన రెంటచింతలలో ఆదివారం పగటి ఉష్ణోగ్రత 37.5 డిగ్రీలు నమోదైంది. ఆగస్టులో మండలంలో సాధారణ వర్షపాతం 100 మిల్లీమీటర్లు కాగా ఇప్పటివరకు కేవలం 35.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గతేడాది ఆగస్టులో 138 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చిలకలూరిపేట ప్రాంతంలో పీపాలలో నీటిని తెచ్చి పంటలకు పోస్తున్న రైతులు

పీపాల లెక్కన కొని మొక్కలకు

- పైర్లను కాపాడుకోవడానికి రైతు అగచాట్లు
- వర్షాభావంతో మందగించిన వ్యవసాయం
- కాల్వల ద్వారా నీరు సరఫరా చేయాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఖరీఫ్ చివర దశకు వచ్చింది వ్యవసాయానికి సరిపడా వర్షాల్లేక సాగు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటలేయాలన్నా, మందులు పిచికారీ చేయాలన్నా అవసరమైన నీరు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. పత్తి, మిర్చి ఇతర వాణిజ్య పంటల సాగుకు, పై మందులు వేయడానికి నీరు కావాలంటే నీరు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ కారణాలతో చిలకలూరిపేట మండలం, నియోజకవర్గంలో మొత్తం సాగు భూమిలో 40 శాతం విస్తర్ణంలోనే పంటలు సాగయ్యాయి. మండలంలో ప్రతిఏడాది 13-15 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని. ప్రస్తుతం నాలుగైదు వేల ఎకరాలకు మించలేదు. మిర్చి 1800 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేస్తే 880 ఎకరాల్లోనే సాగైంది. ఇతర పంటల సాగు 600 ఎకరాల నుండి 150 ఎకరాలకు పడిపోయింది. వరి సాగు మరింత తక్కువగా ఉంది.

2020-21లో చిలకలూరిపేట ప్రాంతంలో ఆగస్టులో 255.6 మిల్లీ

▶ 2లో

డెల్టాలో వరినాట్లు ముమ్మరం

(మొదటి పేజీ తరువాయి)

సాగుకు ఇబ్బంది లేకుండా ఉంది. జిల్లాలో గత నెల రోజుల్లో ఎక్కువ మండలాల్లో ఆశాజనకమైన వర్షాలు కురిశాయి. నిర్ణీత వర్షపాతం కన్నా ఎక్కువగా వర్షాలు కురిసిన మండలాల్లో తెనాలి, చేబ్రోలు, దుగ్గిరాల, గుంటూరు ఈస్టు, వెస్టు, కాకుమాను, కొల్లిపర, పొన్నూరు, ప్రత్తిపాడు మండలాల్లో 90 శాతంకుపైగా వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 50శాతం లోపు మాత్రమే వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో జూన్ నెలలో 97.1 మిల్లీమీటర్లకు గాను 105.8మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. జులైలో 164.9 మిల్లీ మీటర్లకు గాను 255.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఆగస్టులో 164.7 మిల్లీ మీటర్లకు గాను 27వ తేదీవరకు సగటున 112.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

పీపాల లెక్కన కొని మొక్కలకు

(మొదటి పేజీ తరువాయి)

మీటర్ల వర్షంపాతం నమోదవగా ఆ తర్వాత సంవత్సరం 183.8 మిల్లీ మీటర్లుగా ఉంది. ప్రస్తుతం కేవలం 84.6 మిల్లీమీటర్ల వర్షమే కురిసింది. వర్షాభావ పరిస్థితులకు ఈ గణాకాలే అద్దం పడుతున్నారు. దీనికితోడు మునుపెన్నడూ లేనంతగా నీటి సదుపాయం ఉన్న పొలాలకు కౌలు పెరిగింది. గతంలో ఎకరకు రూ.20 వేల కౌలుంటే ఇప్పుడు రూ.30-35 వేలైంది. గతేడాది మిర్చిసాగు ఆశా జకనకంగా ఉండడంతో ఈ ఏడాది ఎక్కువ మంది అదే పంట సాగుకు మొగ్గు చూపగా వర్షాభావ పరిస్థితులతో వారంతా అందోళనలో ఉన్నారు. ఈ ఏడాది 3500 ఎకరాల వరకూ మిర్చి సాగుకు రైతులు సిద్ధమవడంతో అందుకు అనుగుణంగానే నర్సరీల్లోనూ నారును పెంచారు. తీరా నీరు లేకపోవడంతో నాట్లు వేయడానికి వీల్లేకుండా ఉంది. గతేడాది 2200 ఎకరాల్లో పత్తి సాగవగా ప్రస్తుతం 500 ఎకరాలకే పరిమితమైంది. 45-50 రోజుల దశలో ఉన్న ఈ పైరుకు మందులు వేయాలన్నా వేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి సాగర్ కాల్వకు నీరు విడుదల చేస్తే ఉన్న పంటలకు జీవం పోసుకోవడంతోపాటు మిగతా పొలాల్లో సాగుకూ అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

నీరు బయట కొనాల్సిందే

చెన్నుపాటి రాజు, కౌలురైతు,

గతేడాది ఎకరా కౌలు రూ.20 వేలు చొప్పున మూడెకరాల్లో మిర్చి సాగుచేశా. ఈ ఏడాది రూ.36 వేలు కౌలుచెల్లించి ఐదెకరాల సాగు చేపట్టా. ప్రస్తుతం 57 రోజుల దశలో పైరుంది. తొలి విడదల మందులు వేయడానికి కుంటల్లో నీరు సరిపోతుంది. ఆ తర్వాత నీరు అవసరమైతే పీపాల ద్వారా కొనాల్సిందే.

నీట్ ర్యాంకర్‌కు దీపక్ ట్యాబ్ అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

పులుగు దీపక్ ఆధ్వర్యంలో గతేడాది నిర్వహించిన ఉచిత నీట్, జెఈఈ, ఈఎపి సెట్ కోచింగ్ క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థినులు ఇంటర్‌లో మంచి మార్కులు సాధించటంతోపాటు, నీట్‌లో చక్కని ప్రతిభ చూపారు. షేక్.చాందిని ఇంటర్ బైపిసిలో 977 మార్కులు సాధించి, నీట్‌కు ఉత్తీర్ణత సాధించగా బి.హెచ్.కాలేజిలో బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌గా అవార్డు సాధించారు. ఈ సందర్భంగా దీపక్ రూ.20 వేల విలువైన లెనోవో ట్యాబ్‌ను చాందినికి బహుకరించారు. తన చదువుకు అవసరమైన ఖర్చును స్పాన్సర్ చేస్తున్నట్లు చెప్పారు. ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహించటానికి సహకరిస్తున్న మాధవిలత, తన గురువు విశ్వ మాస్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకే బాలోత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి

బాలల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకే మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నన్లు బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ తెలిపారు. తాడేపల్లి పట్టణంలోని అమరావతి ఐకాన్‌లో ఆదివారం ఎంటిఎంసి బాలోత్సవం ఆధ్వర్యంలో గణితంలో ప్రాథమిక అంశాలపై అవగాహన క్లాసును గణితంలో నిష్ణాతులైన లెక్చరర్ ఎస్.లెనిన్‌బాబు బోధించారు. అపార్టుమెంట్స్, వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించిన తరగతుల ముగింపు సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడారు. మాస్టర్ లెనిన్ పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోర్డుపై థియరీ చేసి చూపించిన తీరు బాగుందన్నారు. ఈ ప్రాంతంలో పెద్దఎత్తున బాలోత్సవాలు, ఉగాది బాలోత్సవం, స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణా తరగతులు, చిత్రలేఖనం పోటీలు, మ్యాజిక్ శిక్షణ జయప్రదం కావడానికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలనే మంచి సంకల్పంతో ముందు కొస్తున్న వారి సేవలు వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం కుటుంబ బంధాలు, స్నేహ భావాలు కుచించుకుపోతున్నాయని, పెద్దవారికి, సాటి వారికి సేవ చేయాలనే భావన సమాజంలో కొరవడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కుటుంబాల్లో పిల్లలు ఎన్ని నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవా ల్సింది ఎంతో ఉందని చెప్పారు. పిల్లలు ఒత్తిడితో కష్టపడి కాకుండా ఇష్టపడి చదివే వాతావరణం రావాలని కోరారు. మాస్టర లెనిన్‌బాబు మాట్లాడుతూ ముందు లెక్కలంటే భయం విడనాడాలన్నారు. చేయగలమనే ధైర్యంతో ముందుకు వెళ్తే సాధించలేనిది ఏమీ లేదని చెప్పారు. అవగాహన చేసుకుంటే లెక్కలు తేలికగా చేయవచ్చన్నారు. లెక్కలపై మరింత అవగాహన కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, ఈ అవకాశాన్ని పిల్లలు వినియోగించుకోవాలని సూచించారు. మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లలు తమ ఏకాగ్రతను చదువుపై పూర్తిగా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే తాము అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్దలు యడ్ల బాలకృష్ణ, షితిజ, గౌతమి, పి.సుధారాణి, శ్రీలక్ష్మి, గుప్తా, సిహెచ్. వెంకటరావు, చంద్రలేఖ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యగన్ లీలా సుందరయ్య కళావేదికపై జరుగుతున్న ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకష్ణ, ప్రజాశక్తి బుక్ హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంప్యూటర్ స్కిల్స్ నేర్చుకోవడం వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని చెప్పారు. కంప్యూటర్‌లో మెళకువలు, వెయ్యి రూపాయలకే శిక్షణ ఇవ్వడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఎంకెఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు మున్ముందూ కొనసాగిస్తామని హామీనిచ్చారు.

900 మందికి చీరలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

దామర్ల శివరామకృష్ణ, రామసీతమ్మ సేవాట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ మార్కండేయ పద్మశాలీ కళ్యాణ మంటపంలో సుమారు 900 మందికి చీరలు పంపిణీ చేశారు. రామసీతమ్మ 9వ వర్ధంతిని పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమంలో ట్రస్టు కుటుంబ సభ్యులు వి.ఉమామహేశ్వరి, ఎం.పద్మావతి, విపద్మజ, డి.భాగ్యలక్ష్మి పాల్గొని 50 ఏళ్లలోపు పేద మహిళలకు సిల్కు చీర, 50 ఏళ్లు పైబడినవారికి కాటన్ చీర చొప్పున సుమారు 900 మందికి అందజేశారు. ట్రస్టీలు డి.శివరామకృష్ణ, డీఎస్ఎస్ శ్రీనివాసరావు, వి.శివప్రసాద్, ఎం.భానుప్రసాద్, వి.సత్యనారాయణ, డి.శోభన్‌బాబు, ఎ.కిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బైపాస్‌రోడ్డు విఆర్ అపార్టుమెంట్ ముందు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆదివారం పరిశీలించారు. పది రోజుల క్రితం విఆర్ అపార్టుమెంట్ వాసులు తమ అపార్టుమెంట్ ముందు రోడ్డు, డ్రెయినేజీ పరిస్థితిని వివరించి తాము ఇబ్బందులు పడుతున్న తీరును ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పది రోజుల్లో పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ సమస్య కూడా తీవ్రంగా ఉంది. దీనిపై వజ్ర రెసిడెన్సీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాదు చంద్రశేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆ పనులనూ త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

'లక్ష్యాలకు చేరువగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ'

ప్రజాశక్తి - తెనాలి

సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భవించిందని ఆ సంస్థ రీజినల్ చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త కొత్త సుబ్రమణ్యం అన్నారు. స్థానిక ప్రకాశం రోడ్డు లోని ఎఎస్ఎన్ డిగ్రీ కళాశాల లైబ్రరీ హాల్లో ఆదివారం నిర్వహించిన సమావేశానికి సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రారంభించిన అనతి కాలంలోనే లక్ష్యాలకు చేరువగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పనిచేస్తోందని చెప్పారు. అయితే సంస్థ సభ్యులను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చైర్మన్ రాంచంద్ మాట్లాడుతూ సంస్థ ద్వారా ఆత్మీయ సమావేశాలు తరచుగా జరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

మాట్లాడుతున్న కొత్త సుబ్రమణ్యం

ఈ సందర్భంగా అన్నాబత్తుని శ్రీధర్ ఆక్సిజన్ క్రియేటర్స్‌ను మానవత సంస్థకు అందచేయనున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు నైపుణ్యాలు మీద అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కల్యాణి, టి.శ్రీనివాసబాబు, జి.నాగేశ్వరరావు, సోమయ్య శాస్త్రి, వి.ఫణి, ఆనందయ్య, వి.సత్యనారాయణ, రమణ, చంద్రశర్మ, మానవత సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలపై నేడు టిడిపి నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్రంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాకు వ్యతిరేకంగా సోమవారం రాజధానిలోని ఉద్దండరాయునిపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరగనుంది. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

గుండె జబ్బులు, కేన్సర్‌కు అధునాతన చికిత్సలు

ప్రజాశక్తి - గుంటూరు

నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సిడి) ముఖ్యంగా కార్డియోవాస్కులర్ డిసీజ్ భారం భారతదేశంలో పెరుగుతుందని, ముఖ్యంగా యువతలో ఎక్కువగా ప్రభావితం చేస్తోందని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ విజయ అన్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నూతన పరికరాలపై విలేకర్లకు వివరాలను ఆదివారం వెల్లడించారు. లలితా హాస్పిటల్లోని కార్డియాలజీ విభాగం అన్ని వయసుల వారికీ ప్రాథమిక, అధునాతన గుండె, వాస్కులర్ సమస్యలకు అత్యాధునిక రోగనిర్ధారణ, చికిత్స పద్ధతులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కరోనరీ - పెరిఫెరల్ వాస్కులర్ వ్యాధుల పరీక్షించడంలో అధునాతన జిఇ ట్రాన్స్ థొరాసిక్, ట్రాన్స్ ఈసోఫేజియల్ ఎకో కార్డియోగ్రామ్ తోపాటు నూతన సీమెన్స్ మల్టీ డిటెక్టర్ సినీ సిటి స్కాన్ సహాయపడుతుందన్నారు. సంక్లిష్ట కరోనరీ వ్యాధుల నిర్వహణ కోసం ఇంట్రా వాస్కులర్ అల్ట్రాసౌండ్ (ఐవియుఎస్) మరియు ఆప్టికల్ కో హెరెన్స్ టోమోగ్రఫీ (ఒసిటి)లను అధునాతన క్యాథెబ్‌కు జోడించడం వల్ల ప్రభావవంతమైన, సురక్షితమైన ఇంటర్వెన్షనల్ ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఎండోవాస్కులర్ ఇంటర్వెన్షన్స్ డైరెక్టర్ డాక్టర్ అనురాగ్ (ఎమ్‌డి, డిఎం) కార్డియాలజీ ప్రతిష్టాత్మకమైన మద్రాస్ మెడికల్ కాలేజీ నుండి పట్టభద్రుడయ్యారని, యుకె నుండి కాంప్లెక్స్ కరోనరీ ఇంటర్వెన్షన్స్, ఇంట్రావాస్కులర్ ఇమేజింగ్‌లో ఫెలోషిప్ పొందారని తెలిపారు. డాక్టర్ అనురాగ్ 400 కంటే ఎక్కువ పెరిఫెరల్ యాంజియోప్లాస్టీలు/స్టెంటింగ్‌ల అనుభవం ఉందని, స్ట్రక్చరల్, వాల్వులర్ హార్ట్ డిసీజెస్ కోసం ఒక ప్రత్యేక క్లినిక్స ప్రారంభించారని పేర్కొన్నారు. ఎండో మయోకార్డియల్ బయాప్సీలతో సహా అరుదైన కార్డియో-ఆంకాలజీ రోగులను నిర్వహించడంలో కూడా అనుభవం ఉందన్నారు.

ప్రపంచవ్యాప్తంగా మరణానికి 2వ ప్రధాన కారణం కేన్సర్ అని, భారతదేశంలో ప్రతి 9 మందిలో ఒకరికి జీవితకాలంలో కేన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. లలిత హాస్పిటల్ మెడికల్ - సర్జికల్ ఆంకాలజిస్ట్‌తో కొత్త సమగ్ర కేన్సర్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలలో డే కేర్, కీమోథెరపీతో ఇన్‌పేషెంట్ చికిత్సలు, హార్మోన్ థెరపీ, ఇమ్యునోథెరపీ, కేన్సర్ సర్జరీలు ఉన్నాయని, డిజిటల్ మామోగ్రామ్,

వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ విజయ

కోలనోస్కోపీ, బ్రోంకోస్కోపీ, ఎండోస్కోపీ, కాల్పోస్కోపీ, హెచ్‌ఆర్‌సిటి చెస్ట్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, లాబరేటరీ సేవలు వంటి కేన్సర్ స్క్రీనింగ్ డయాగ్న స్టిక్‌లు ఒకేచోట అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ స్రవంతి (ఎమ్‌డి, డిఎం) మద్రాస్ మెడికల్ కళాశాల నుండి పట్టభద్రులయ్యారని, యుకెలోని మాంచెస్టర్లోని క్రిస్టీ కేన్సర్ ఆసుపత్రిలో అత్యాధునిక చికిత్సల్లో శిక్షణ పొందారని తెలిపారు. భారతదేశంలో ఏడాదికి 15 లక్షల కేన్సర్ కేసులు నమోదవుతున్నాయని, వీటిలో అత్యంత సాధారణ కేన్సర్లు రొమ్ము, ఊపిరితిత్తులు, పెద్దపేగు, గర్భాశయ, కడుపు, ప్రోస్టేట్. అన్ని రకాల కేన్సర్ పేషెంట్లు - పేద, మధ్య తరగతి వారికీ అత్యాధునిక వైద్యం అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు.

ప్రైవేటు ల్యాబ్ సిబ్బంది వస్తే కేసులు

జిజిహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రైవేటు ల్యాబ్ ల సిబ్బంది తిరిగినట్లు కనపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి లో ఆయన ఆకస్మికం గా ఆయన తనిఖీ చేశారు. ఎవరైనా ప్రైవేట్ ల్యాబ్ నిర్వాహకుల సిబ్బందిని ఆస్పత్రిలోకి అనుమతించవద్దని కోరారు. అవసరమైతే పోలీసు కేసులు పెడుతామని ఆయన హెచ్చరించారు. ఈ ఆసుపత్రి సిబ్బంది బయటి ప్రైవేటు ల్యాబ్ లను ప్రోత్సహిస్తే సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. అన్ని పరీక్ష లు ఇక్కడే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పేదరోగులను పిండి వసూలు చేసుకునే పరిస్థితి మానుకోవాలని ఆయన సూచించారు.

టిడిపి బోర్డు మెంబర్ యానాదయ్యకు సత్కారం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

టిటిడి బోర్డులో నాయి బ్రాహ్మణులకు అవకాశం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. తద్వారా ఇప్పటి వరకు సేవకులుగానే మిగిలిపోయిన నాయీ బ్రాహ్మణులను పాలకులుగా మార్చిన చరిత్రను సీఎం సొంతం చేసుకున్నట్లు వారు చెప్పారు. జగనన్న నేతత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక మార్పుకు ఇదే సరైన నిర్వచనమని వారు పేర్కొన్నారు. పాలకవర్గం సభ్యుడిగా నియమితులైన రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సిద్ధవటం యానాదయ్య ఆదివారం బందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో కలిసి వారు యానాదయ్యను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. యానాదయ్య మాట్లాడుతూ, గుళ్ళో అడుగు పెడితే తోకలు కత్తిరిస్తానన్న చంద్రబాబుకు గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. తిరుమలతో సహా అన్ని దేవాలయాలలో నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు, గౌరవాన్ని జగన్ ఇచ్చారన్నారు.

వైహెచ్‌కె మోహనరావుకు హంస పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో భాషాదినోత్సవం సందర్భంగా హంసా పురస్కారాలు విడుదల చేసింది. ఈ పురస్కారానికి సాహిత్య విభాగంలో పల్నాడు జిల్లాకు చెందిన జర్నలిస్టు, రచయిత వై.హెచ్.కె.మోహనరావు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ప్రాంగణంలోని ఈనెల 29న జరిగే కార్యక్రమంలో మోహనరావుకు పురస్కారం అందచేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎద్దు మృతి

- **క్రోసూరులో ఘటన**
- **రైతుకు గాయాలు, అతని బంధువుల ధర్నా**

ప్రజాశక్తి-క్రోసూరు

క్రోసూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పేరేచర్ల నుండి చిప్స్ లోడుతో వస్తున్న టిప్పరు, గ్రామ సమీపంలో రాగానే అరక కట్టుకొని కాడి మాను వెళుతున్న ఎద్దులను ఢీకొట్టింది. కాడిమాను సగానికి విరగడంతో ఒక ఎద్దు అక్కడక్కడే మృతి చెందింది. రైతుకు కుడి భుజానికి , తుంటికి తీవ్ర గాయాలు అయినాయి చికిత్స నిమిత్తం రైతును హాస్పిటల్కి తీసుకెళ్లారు. సంఘటన స్థలంలో రైతు బంధువులు కొద్దిసేపు ధర్నా చేయడంతో పోలీసులు సంఘటనస్థలాన్ని చేరుకొని బాధితులకు న్యాయం జరిగేటట్లు చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాని విర మించారు.. రోజుకి కొన్ని వందల ఇసుక లారీలు పోవడంతో గ్రామంలోకి వచ్చేటప్పుడు స్పీడ్ నిద్ర లేకపోవడంతో ప్రమాదాల జరుగు తున్నాయని ప్రజల ఆందోళన చెందుతున్నారు.. సుమారు లక్ష రూపాయలు విలువగల ఎద్దు మతిందని బాదిత బంధువులు తెలిపారు. కాడి సగానికి ఎరగడంతో మరొక ఎద్దు కు రైతుకు ప్రమాదం తప్పిందని పోలీసులుతెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారించి చర్యలు తీసు కుంటామని క్రోసూర్ ఎస్సై పి.రవీంద్ర తెలిపారు.

మత్స్యకారునికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

మండలంలోని పశువేమల గ్రామ సమీపంలోని నాగార్జునసాగర్ కుడికాలువ కట్టపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయపురి సౌత్ చెందిన సిహెచ్ రమణ కు తీవ్ర గాయాలయ్యాయి. రమణ రోజువారి పనుల్లో భాగంగా పసువేముల సమీపంలో నాగార్జునసాగర్ కుడి కాలువలో చేపల వేటకు వెళ్లి తిరిగి విజయపురి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో రమణా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో రామనాకి తీవ్ర గాయాలయ్యాయి.

రమణాను 108 ద్వారా మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి తరలించి మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు విజయపురి సౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3న ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పసి బాల్యానికి పసిడి బాటలు చూపే నిత్య విద్యార్ధులు నిజమైన గురువులని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యా నించారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి ఉపా ధ్యాయులే కీలకమని ఆయన కితాబిచ్చారు. టీచర్స్ డే సందర్భంగా జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులను గుర్తించి, వారిని గౌరవించాలని సమైఖ్య (ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్‌పి ఎల్‌టిఓ) సంకల్పించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కేయస్ లక్ష్మణరావు నేతత్వంలో ఒక జ్యూరీ కమిటీని ఏర్పాటు చేసుకుని, నిష్పక్షపాతంగా ఉత్తమ గురువులను ఎంపిక చేసి, సెప్టెంబర్ 3వ తేదీన గుంటూరు వేదికగా వారిని ఘనంగా సత్కరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో

ఆదివారం బందావన్‌గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్ ఆధ్వర్యంలో ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని కలిసి రాష్ట్ర స్థాయిలో జరగనున్న గురువుల సన్మాన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని కలిసిన వారిలో ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్య క్షుడు డాక్టర్ పి.నాగయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సురేష్, వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ డి.రమేష్ తదితరులు ఉన్నారు.

పోలవరాన్ని సంక్షోభంలోకి నెట్టిన ప్రభుత్వాలు

- **జన చైతన్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

పోలవరం బహుళార్ధక సాధక ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షోభంలోకి నెట్టాయని జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్లో పోలవరం ప్రాజెక్టు పురోగతి పై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. వ్యవసాయ, నీటిపారుదల నిపుణులు అక్కినేని భవానీ ప్రసాద్ ప్రసంగిస్తూ బచావత్ అవార్డులో ప్రకటించిన విధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరగాలన్నారు. 150 అడుగుల ఎత్తును తగ్గించే అధికారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. లక్ష మందికి పైగా ఉన్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పూర్తి నష్టపరిహారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రముఖ సామాజిక విశ్లేషకులు టి. లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ2014-2019 మధ్యనాటి ప్రభుత్వం పోలవరం పై 11,450 కోట్లు వెచ్చిస్తే నేటి ప్రభుత్వం గత 50 నెలలలో 4450 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. నిర్వాసితులకు పునరావాస కల్పన కోసం 33 వేల కోట్లు చెల్లించాలని ఇప్పటివరకు 7000 కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. నిర్వాసితుల్లో 55 శాతం గిరిజనులు ఉన్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు త్వరతగతిన అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వంపై నేటి ప్రభుత్వం ఒత్తిడి తేలేకపోతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయాలని వెంటనే హైదరాబాదు నుండి రాజమండ్రి కి మార్చాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ పోలవరం ప్రాజెక్టు

మాట్లాడుతున్న భవానీ ప్రసాద్, లక్ష్మీనారాయణ, లక్ష్మణరెడ్డి తదితరులు

అమలుకు మించిన సంక్షేమ కార్యక్రమం మరొకటి లేదన్నారు. కోట్లాది ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచే జీవనాడి పోలవరం అని వివరించారు. అఖిలభారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, బి సీ మహాజన సభనేత ఉగ్గం సాంబ శివరావు, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ పి పోతురాజు, తెలుగు అధ్యాపకులు డాక్టర్ బి.సింగారావు ప్రసంగించారు.

పోలీసులు అదుపులో వాహనాలు

ప్రజాశక్తి-నకరికల్లు

ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుకలు తయారు చేసే మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పోలీ సులు స్వాధీనం చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై బాలకష్ణ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపల్లి గ్రామంలోని సాగర్ మెయిన్ కెనాల్ పక్కన గల పొలాల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం మేరకు దాడి చేసి సుమారు 10 ట్రాక్టర్లను మూడు జెసిబిలను అదుపులోకి తీసుకొని మైనింగ్ శాఖ అధికారుల దష్టికి తీసుకెళ్లినట్టు ఎస్సై తెలిపారు. మైనింగ్ ,రెవెన్యూ ,అధికారుల అను మతులు లేకుండా మట్టి తవ్వకాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

కుంచనపల్లిలో చోరీకి యత్నం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎం టి ఎం సీ పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో శనివారం రాత్రి 10 30 నిమిషాల సమయంలో ఐదుగురు గుర్తుతెలియని దొంగలు గ్రామానికి చెందిన చుక్క కిట్టయ్య ఇంటిలో చొరబడి చోరీకి యత్నించారు. గమనించిన కిట్టయ్య కుటుంబ సభ్యులు పెద్దగా కేకలు వేయడంతో దొంగలు కిట్టయ్య ఇంటి నుండి గోడ దూకి సిపిఎం కుంచనపల్లి గ్రామ రెండవ శాఖా కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు ఇంటి వైపుకు వెళ్లడంతో వెంకటేశ్వర రావు సోదరుడు కాజా కాశీ రాంబాబు ఒక వ్యక్తిని అడ్డ గించి పట్టుకోవడం జరిగింది. దీంతో స్థానికులు మిగతా దొంగల కోసం పట్టుకోవడానికి ప్రయత్నించగా గోడ దూకి పారిపోయినట్లు సిపిఎం నాయకులు కాజా వెంక టేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అప్ర మత్తమైన వెంకటేశ్వరరావు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు చోరీకి యత్నించిన దొంగను అదుపులోకి తీసుకున్నారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

ప్రజాశక్తి-దుర్గి

మండల పరిధిలో కంచరగుంట గ్రామంలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు దుర్గి ఎస్ఐ ఎం శివ తెలిపిన వివరాల ప్రకారం పేకాట ఆడుతున్న సమాచారంతో దాడి చేయగా ఎనిమిది మంది పేకాట రాయను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు వారి వద్ద నుంచి 7200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

'బాబు ష్యూరిటీ' విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పెదకూరపాడు నియోజకవర్గంలో సెప్టెంబర్ 1న ుంచి 45 రోజులు పాటు జరిగే బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ కోరారు. గుంటూరులోనిఅమరావతి రోడ్డులోని ఒక ఫంక్షన్ హాలులో నియోజకవర్గం సీనియర్ నాయకులు మండలం పార్టీ ప్రెసిడెంట్స్ క్లస్టర్ ఇంచార్జ్, యూనిట్ ఇన్చార్జిలతో, సమావేశమైన పెదకూరపాడు నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



కొండవీటి రచయితల సంఘం ఆధ్వర్యంలో సన్మానాలు

ప్రజాశక్తి -కారంపూడి

పల్నాడు జిల్లా, కారంపూడి కి చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు,రచయిత బి.మాన్ సింగ్ నాయక్, తెలుగు భాషాభిమాని,షేక్ మహమ్మద్ రఫీలకు పల్నాడు జిల్లా కొండవీటి రచయితల సంఘం వారు ఘనంగా సన్మానించారు. ఫిరంగిపురంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వ హించిన కవి సమ్మేళనంలో తెలుగు గొప్పదనం , గిడుగు వెంకట రామ్మూర్తి చేసిన సేవల కవిత/పద్య రూపంలో ఆలపించారు. కొండవీడు రచయితల సంఘం అధ్యక్షులు సయ్యద్ మహమ్మద్ రఫీ,ప్రధాన కార్యదర్శి డాక్టర్ తోళ్ళమడుగు గోవిందులు వారిని సన్మానించారు.



కళ తప్పిన ఎత్తిపోతల జలపాతం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలంలోని పర్యాటక ప్రాంతమైన ఎత్తిపోతలకు ఎగువ నుంచి వచ్చే ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఎత్తిపోతల జలపాతం కళ తప్పింది.వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించాల్సిన జలపాతం ఎండిపోయినట్లు దర్శనమిస్తోంది.దీనితో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు నిరాశ చెందుతున్నారు.వర్షాకాలంలో ఎత్తిపోతలలో జలకళ లేకపోవడం ఇదే మొదటిసారి అని పర్యాటక శాఖ ఉద్యోగులు చెబుతున్నారు.పచ్చని కొండల నడుమ 70 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందకు జాలువారుతూ సందర్శకులను ఉత్సాహపరిచే ఎత్తిపోతల జలపాతం నేడు వెల వెల బోవడం పర్యాటకులను నిరుత్సాహ పరుస్తోంది.

సాతులూరు- చందవరం గ్రామాల మధ్య

నేలకొరిగేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-నాదెండ్ల

కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్‌స్తంభం కారణంగా ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. మండలంలోని సాతులూరు- చందవరం గ్రామాల మధ్య రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభం పూర్తిగా వాలిపోయి రోడ్డు మీద పడేందుకు సిద్ధంగా ఉండటంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. దీంతో, ప్రజలు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు అప్రమత్తమై వెంటనే ఆ స్తంభాలకు మరమ్మతులు చేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. వర్షకాలం కావడంతో ప్రధాన రహదారి పక్కనే ఉంటాం. ఏ ప్రమాదాలు ముంచుకొస్తాయని ప్రయాణికులు, వాహనదారులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు

దోమల బెడదతో ప్రజల పాట్లు

- అమరావతి మండలంలోని పలు గ్రామాల్లో విజృంభిస్తున్న దోమలు
- కంటిపై కునుకు లేదంటున్న ప్రజలు

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండలంలోని జూపూడి, వైకుంఠపురం, లింగాపురం, మల్లాది, లేమల్లె మొదలైన గ్రామాల్లో పారి శుధ్యం పడకేసింది. ఏ వీధిలో చూసినా మురుగు దుర్గంధం వెదజల్లోందని మండల పరిధిలోని గ్రామ ప్రజలు వాపోతున్నారు. రాత్రి అయితే కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని మండల ప్రజలు తెలిపారు. పంచాయతీ పరిధిలో మురుగు కాల్వల్లో లావా చల్లి దోమల అభివృద్ధి చెందకాకుండా అరికట్టాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులపై ఉందని, వారానికి ఒకసారి అయినా ఫాగింగ్ నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. గత కొన్నిరోజులుగా భారీ వర్షాలు కురవడంతో పల్లపు ప్రాంతాల్లో గుంతలు, మరుగులు కాలవల్లో నీళ్ల నిలబడి దోమలు అధికంగా అభివృద్ధి చెందుతున్నాయని, దోమ కాటు వల్ల పిల్లలకు,వృద్ధులకు విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అనారోగ్యాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దోమల మందు పిచికారి చేయాలని కోరారు. నీటి నిల్వలు ఉన్నచోట ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు పర్యటించి బ్లీచింగ్ లాంటివి చెల్లించి ప్రజలకు అవగాహన కల్పించి డెంగీ,మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెంద కుండా చూడాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందిపై ఉంది. గ్రామాల్లో ఫాగింగ్ మచ్చుకైన కాన రావట్లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షించి మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి దోమల వ్యాప్తిని అరికట్టాలని, స్వచ్ఛంద సంస్థలు దోమతెరలు ప్రజలకు అందించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు, పంచాయతీల సమన్వయంతో గ్రామాల్లో ఫాగింగ్ చేస్తే మరింత ఆరోగ్యవంతమైన గ్రామాలుగా మండల ఉంటుందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

చెంచుకాలనీలో నిలిచి ఉన్న మురుగునీరు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

భవన,ఇతర నిర్మాణ కా ర్మిక సంఘం పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక పండరీపురంలోని ఏలూరు సిద్దయ్య విజ్ఞాన భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి ఎం.విల్సన్ అధ్యక్షత వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి సంక్షేమ పథకాలు, సంక్షేమ బోర్డుకు సం బంధించిన సమస్యల పరిష్కారానికి అడ్డంగా ఉన్న మెమో నెంబర్ 1214 రద్దు చేయాలని డిమాండ్ చేశ్వారు. అర్హులైన కార్మికులందరికీ గుర్తింపుకార్డులు ఇచ్చి వారందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ చేసే పోరాటంలో భాగంగా సెప్టెంబర్ నెల 5వ తేదీన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి వినతిపత్రం ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్మికులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రాధాకృష్ణ మాట్లాడుతూ కమ్యూ నిస్టులు పోరాటాలకు కార్మికుల పట్ల పోరాటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని, వారి పోరాటాలు ఫలితంగా ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంక్షేమ బోర్డుని ప్రవేశపెట్టి అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

ప్రస్తుత ప్రభుత్వం ఈ బోర్డును నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మికులు చేసే పోరాటానికి తమ పార్టీ మద్దతు తెలియజేస్తోందని చెప్పారు. అనంతరం ఇసికె పార్టీ నాయకులు ముత్తయ్య , ఎమ్మార్పీఎస్ నాయకులు ఆడప మోహన్, సీమాంధ్ర శ్రేయస్ సంక్షేమ సమితి సాధన అధ్యక్షులు అల్లాబక్షు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు బాబు, సిఐటియు చిలకలూరి పేట మండల ప్రధాన కార్యదర్శి పేరుపోయిన వెంక టేశ్వర్లు, ఐద్వా మహిళ సంఘం నాయకురాలు భారతి, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు తోట రాజా రమేష్, నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్ర హ్మణ్యం, బిరుదు లక్ష్మణ్‌తో పాటుగా ప్రజా సంఘాల ప్రతి నిధులు పాల్గొని ప్రసంగించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిలార్ మసూద్

వాహన చట్ట సవరణతో రవాణా కార్మికులపై పెనుభారం

- దుర్భరంగా మోటార్ వర్కర్ల జీవితాలు
- వాహన మిత్ర పథకాన్ని వర్తింపజేయాలి
- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వాహన చట్ట సవరణతో మోటార్ వాహనాల డ్రైవర్లపై పెనుభారం మోపాయని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ అన్నారు. చేయూత ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు పట్టణ మహాసభ ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎస్.సైదేశ్వరరావ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శివాజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా మోటార్ వర్కర్ల జీవితాలు దుర్భరంగా మారాయని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని,ఇన్సూరెన్స్ ప్రీమియం విపరీతంగా పెంచారని, రూ.200 ఉన్న గ్రీన్ టాక్స్ రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రోడ్ ట్యాక్స్ 30 శాతం పెంచారని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు పెంచారని, చిన్న చిన్న పొరపాట్లకు కూడా భారీ మొత్తంలో పెనాల్టీలు విధిస్తున్నారని అన్నారు. స్పేర్ పార్ట్స్ పై 18 శాతం జిఎస్టి వసూలు చేస్తున్నారని, రాష్ట్రంలో రోడ్లు గుంతల మయంగా మారాయని, దీంతో వాహనాల మరమ్మతులు మరింత పెరిగి నిర్వహణ ఖర్చులు పెరిగాయని అన్నారు. చేయూత ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.హరిపోతురాజు మాట్లాడుతూ వాహన మిత్ర పథకం డ్రైవర్లు అందరికీ అమలు చేస్తున్నామని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో 12 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉంటే కేవలం రెండు లక్షల 60, వేల మందికి మాత్రమే వాహన మిత్ర అమలవుతోందని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్ కు వాహన మిత్ర పథకం వర్తింపచేయాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పూర్తిగా వైద్యం ఖర్చు ప్రభుత్వం భరించాలని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని అన్నారు.

అనంతరం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులుగా ఎం.హరి పోతురాజు, అధ్య క్షులుగా నాలి రాజేంద్ర,కార్యదర్శిగా ఎ.వెంకటేశ్వర్లు, ట్రెజ రర్ గా పోలయ్యతో కలిపి 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

చేయూత ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు పట్టణ మహాసభలో పాల్గొన్న నన్నపనేని శివాజీ తదితరులు

గుంటూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నళినీకాంత్ తదితరులు

గుంటూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా వ్యతిరేక విధానాలపై 30 నుండి నిరసనలు

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 30వ తేదీ నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు జరిగే సమరభేరిని జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్లను స్థానిక మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ గతంలో ఎన్నడూ లేని విదంగా బిజెపి అధికారంలోకి వచ్చాక ఆరు సార్లు పెరిగి రూ.1200కు చేరిందని, పెట్రల్, డీజిల్ ధరలు కూడా అదే దారిలో ఉన్నాయని మండిపడ్డారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను ఊడబీకిందని, నల్లడబ్బు వెలికితీస్తానని చెప్పిన మోడీ ధనవంతులు తమ వద్ద ఉన్న నల్లడబ్బును వైట్‌గా మార్చుకునేందుకు అవకాశం కల్పించారని విమర్శించారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో కరెంటు ఛార్జీలు పెంచి సామాన్య మధ్య తరగతి ప్రజానీకం నడ్డి విరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ అనుసరిస్తున్న విధానాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అత్యంత ఉత్సాహంగా అమలు చేస్తుందని అన్నారు. బిజెపి పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలే తమ ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం గమనించడంలేదన్నారు. లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి ప్రాథమిక చట్టాలను నిర్వీర్యం చేశారని, వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ ఒకటో తేదీన సచివాలయాల అధికారులకు అర్జీలు ఇవ్వాలని, ప్రతి ఇంటికి కరపత్రం పంచాలని, సెప్టెంబర్ 4వ తేదీ మండల కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం రూరల్, పట్టణ కమిటీ జనరల్ బాడీ సమావేశాల్లోనూ రామారావు మాట్లాడారు. సమావేశాలకు పున్నయ్య, కె.కరుణాకరరావు అధ్యక్షత వహించారు. తాడేపల్లి పట్టణం, రూరల్ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు పట్టాలివ్వాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తీర్మానించారు.

సుందరయ్యనగర్, కృష్ణవేణినగర్, నదీ పరివాహక ప్రాంతంలో రివిట్‌మెంట్ నిర్మించి పేదలకు రక్షణ కల్పించాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, గ్యాస్, విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ, కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మూడు ప్రాంతాల్లో జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, పట్టణ, రూరల్ కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, డి.వెంకటరెడ్డి, నాయకులు డి.శ్రీనివాస కుమారి, వి.దుర్గారావు, డివి భాస్కరరెడ్డి, వై.బర్నబస్, కె.మేరి, పి.గిరిజ, కె.బాబూ రావు, డి.విజయబాబు, ఎస్‌కె బాష, భూజంగరావు, ప్రభాకర్, వి.రామారావు, కె.ఉష, బి.కుమారిపాల్గొన్నారు.

తాడేపల్లి పట్టణంలో ప్రచారంలో మాట్లాడుతున్న నాయకులు

మేడికొండూరులో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపియం ఆధ్వర్యంలో ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకూ జరిగే నిరసనల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, బియ్యం, పాలు, పాలపదార్థాలపై జిఎస్‌టి వేయటంతో అదనపు భారం పడుతుందన్నారు. విద్యుత్ బిల్లులు భారీగా పెంచారన్నారు. పదేళ్ల క్రితం వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి పగటి పగలు, రాత్రి వాడుకున్న కరెంటుకు వేర్వేగా ఛార్జీలు వసూలు చేయాలని కేంద్రం రంగం సిద్ధం చేస్తుందన్నారు. కేంద్రం పెట్టిన షరతులకు రాష్ట్ర ప్రభుత్వం లొంగి ప్రజలకు విద్యుత్ భారాలను మోపుతోందని విమర్శించారు. మరోవైపు ఉపాధి లేక నిరుద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 1న వార్డు సచివాలయాల్లో వినతిపత్రాలు, 4న తాలూకా ఆఫీసుల వద్ద ధర్నా చేపడుతున్నామన్నారు. కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నగరంలో సిపిఎం కరపత్ర ప్రచారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరశిస్తూ సిపియం ఆధ్వర్యంలో ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపియం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమాల విజయవంతానికి పార్టీ నాయకులు ఆదివారం డొంకరోడ్డులోని నిరుపేదల కాలనీ, బొంగరాలబీడు ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డొంకరోడ్డు ఏరియా శాఖ కార్యదర్శి గండికోట శంకర్, పి.దీప్తి మనోజ, పి.గొర్లదీవెనరావు పాల్గొన్నారు.

మారుతీ నగర్‌లో ప్రచారం..

అదనపు విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ సిపియం నాయకులు ఆదివారం నాయిబ్రాహ్మణ కాలనీలో, మారుతీ నగర్‌లో ప్రచార కార్యమ్రకం చేపట్టారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు బి.సత్యనారాయణ, ఎస్.కె.ఖాసింవలి, రంగ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని తుమ్మపూడిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు, నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణల పేరుతో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం, సాధారణ వినియోగదార్లపై వివిధ రకాల చార్జీల పేరుతో బిల్లుల భారం వేయడం తగదన్నారు. వై.స్టాలిన్, ఎ.పాములు, వై.శివయ్య, వై.నాగేశ్వరావు, బంగారుబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి

పట్టణంలోని సింహాద్రి శివారెడ్డి భవనంలో పోస్టర్‌ను ఆవిష్కరించగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడారు. 30న పట్టణంలోని ఒకటో వార్డులో గల సిపిఎం కార్యాలయం వద్ద నుండి సమరభేరి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ఒకటి, రెండు తేదీల్లో వార్డు సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. నాలుగో తేదీన కార్పొరేషన్ కార్యాలయం వద్ద, తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుంది వివరించారు. కార్యక్రమంలో నాయకులు పి.బాలకృష్ణ, జె.శివభావన్నారాయణ, కె.వెంకటేశ్వరరావు, ఎం.చంద్ర, బి.స్వామి నాథ్, భార్గవ, నాగేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేరేచర్లలో పోస్టర్‌ను ఆవిష్కరించగా జిల్లా నాయకులు బి.శ్రీనివాసరావు మాట్లాడారు. బి.రామకృష్ణ, ఎస్ఎం బాషా, సుధాకర్‌రెడి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో

గుంటూరు నగరంలో ప్రచారం



చేబ్రోలులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - చేబ్రోలు

మండల కేంద్రమైన చేబ్రోలులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని భారతదేశానికి ఇచ్చి దిశా నిర్దేశం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నవంబర్ 26న అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గల్లా జ్ఞానశేఖర్, వై.హరిబాబు, డి.రాము, కె.పాములు, ఆర్.అరుణ, పి.ప్రభుదాసు, రత్నాకర్, చైతన్య, నాగేశ్వరావు, డి.శ్రీనివాసులు, పి.బాలాజీ పాల్గొన్నారు.

డాక్టర్ రమణ యశస్వికి గిడుగు పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

నగరానికి చెందిన ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రమణ యశస్వి గిడుగు రామ్మూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా ఒక తెలుగు పుస్తకాన్ని ప్రచురిస్తూ న్యూమరిక్కులు అనే కొత్త కవితా ప్రక్రియ రూపశిల్పి అయిన యశస్విని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధిక భాష సంఘం అధ్యక్షులు విజయబాబు తెలిపారు. డాక్టర్ రమణ యశస్వి గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్థో విభాగాధిపతిగా ఉన్నారు. ఆయన పురస్కారానికి ఎంపికైన సందర్భంగా అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు.

విద్య, వైద్య రంగాల్లో రాణించిన సదాశివరావు

ప్రజాశక్తి-తెనాలి : నేటి సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసే విద్యా, వైద్య రంగాలలో రాణించిన మహనీయుడు డాక్టర్ కాసరనేని సదాశివరావు అని ప్రముఖ గుండె శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే అన్నారు. స్థానిక నందులపేట కవిరాజా పార్క్ విజికె భవన్‌లో ఆదివారం రాత్రి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వాకర్స్ క్లబ్, చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ కాసరనేని సదాశివరావు శత జయంతి సభ నిర్వహించారు. చైతన్య వేదిక అధ్యక్షులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన సభలో 'గుండె శస్త్ర చికిత్స-నూతన విధానాలు- అవగాహన' అంశంపై డాక్టర్ ఆళ్ల గోపాలకష్ణ గోఖలే ప్రసంగించారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య బీమా అనివార్యమని, వీలైతే దానికి చట్టబద్ధతా కల్పించాలని ఎన్నికపల్పుడు డిమాండ్ చేయాలన్నారు. సామాన్యులకు వైద్యం భారం కాకుండా ఆదర్శప్రాయులు ముందుకు రావాలని కోరారు. సభకు హాజరు కావాల్సిన విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య వాట్సాప్ ద్వారా పంపించిన సందేశాన్ని డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వర ప్రసాద్ వినిపించారు. సభలో చైతన్య వేదిక కార్యదర్శి కె.రవిబాబు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జి.వెంకటరత్నం పాల్గొన్నారు.

ఫుట్ బాల్ క్రీడాకారులను అభినందించిన కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని శరభయ్య హైస్కూల్ క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న ఫుట్ బాల్ క్రీడాకారు ను సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు.శివ సాయి కోచింగ్ సెంటర్ కి చెందిన ఫుట్ బాల్ క్రీడాకారులు అండర్ 14 విభాగంలో జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారు . క్రీడాకారులను శివ సాయి కోచింగ్ సెంటర్ కోచ్ సురేష్ ను కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం అభినందించారు . కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పూజల వెంకట కోటయ్య పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించండి

ప్రజాశక్తి - వినుకొండ

ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ-2, పీజీటీలకు మూడు నెలల జీతం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీపీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం వినుకొండలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖనందు బదిలీలు, రీ-అపోర్స్మెంట్, పదోన్న వేతులు పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ:2, ం2 పిజిటిలకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులు పడుతుందని వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఎపిటిఎఫ్ 1938 పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.శివ నాగరాజు, గౌరవ అధ్యక్షుడు పమ్మి వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు బి పుణ్య నాయక్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ గదులకు రూ.20 వేల విరాళం

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండల కేంద్రమైన బెల్లంకొండ ముస్లిం కమ్యూనిటీ గదులు నిర్మాణానికి పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మలపాటి శ్రీధర్ రెండు లక్షల రూపాయలు విరాళం అందజేశారు. ఆదివారం బెల్లంకొండ ముస్లిం సంఘస్తులు మత పెద్దలు అందరూ కొమ్మలపాటి శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. వీరి వెంట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి పిఎస్కె మస్తాన్ షరీఫ ,(సర్పంచ్ గడ్డిపర్తి సముద్రం, కొండవీటి అబ్దుల్ రజాక్, తెలుగు యువత అధ్యక్షులు కెఎస్కె సలాం రబ్బాని. జబ్బారు, సైపుల్ల మౌలానా తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ నుండి టిడిపిలోకి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి న్యాయవాది షేక్ జానీ ఖాజావలి ఆయన తండ్రి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చాంద్ బాషాలు టిడిపి ఆదివారం లో చేరారు.టిడిపీ నియోజకవర్గ ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు . కాంగ్రెస్ పార్టీ నాయకులకు కన్నా పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

తెలుగు భాషను కాపాడుకుందాం

ప్రజాశక్తి - మాచర్ల

తెలుగు ప్రజల సంస్కృతీ సాంప్రదాయాలకు తెలుగు భాష ఎంతో అవసరమని, మారిన పరిస్థితులలో తెలుగు పట్ల తీవ్ర నిర్లక్ష్యం జరుగు తోందని, దాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డాక్టర్ ఎం. కమలహాసన్ రావు అన్నారు తెలుగు భాష దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక పలనాడు జిల్లా కార్యదర్శి జేవీకేఎస్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కమలహాసన్ రావు మాట్లాడుతూ ప్రాథమిక విద్య ఖచ్చితంగా మాతృభాషలో ఉంటేనే పిల్లల్లోవిజ్ఞానం పెరుగుతుందని అది మేధావులు చెప్పిన మాట అని అన్నారు. మరో ముఖ్య అతిథి జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు కేలం ఆదినారాయణ మాట్లాడుతూ గ్రాందికంగా ఉన్న తెలుగు భాషను వాడుక భాషగా మార్చిన ఘనత గి డుగు రామ్మూర్తి పంతులు దేనని తెలిపారు. కార్యక్రమంలో భాషాభివ ానులు ఉపాధ్యాయ సంఘం నాయకులు కిరీట్ రెడ్డి గాలి బ్ మాస్టర్ గారు పఠాన్ గౌస్ మొహిద్ది న్ చెన్నకేశవరావు , గ్రంథాలయ అధికారి ఫణి భూషణ్ పాల్గొన్నారు.

పేద వర్గాలకు విద్య ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పేద వర్గాలకు విద్యను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్ నందు ఆదివారం కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాలబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్డ్స్ సంస్థ విద్య వ్యాప్తి కోసమే బాల బాట ద్వారా దళిత పేద పిల్లలు కోసం చేస్తున కషి అభనందనీయం మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు.కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో లెనిన్ నగర్ లో కార్డ్స్ స్కూల్ లో ఏర్పాటు చేసిన పేదల విద్య అభివద్ధి సామాజిక బాధ్యత అనే అంశంపై స్థానికులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమనికి కార్డ్స్ డిప్యూటి డైరెక్టర్ టి అమర్ నాథ్ అధ్యక్షత వహించారు. మాజీ ప్రభుత్వ న్యాయ



'బాలబాట'లో మాట్లాడుతున్న కొమ్ము ముక్కంటి

వాది రుత్ బానియన్ మాట్లాడుతూ విద్య ద్వారానే దళితులు పేద వర్గాలు ఆత్మ గౌరవం గా జీవిస్తారని అన్నారు.డాక్టర్ సుభాని మాట్లాడుతూ విద్య ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండాలని సమాజంలో జీవించటానికి విద్య అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో జాషువా కళ సమితి అధ్యక్షులు చల్లగుండ్ల సంతోష రావు,కార్డ్స్ డీడీ సుబ్బారావు,బాలబాట ఏ సి ఓ విజయ కుమార్,దళిత సేవాదళ్ కోటి పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రజా కవి గద్దర్ సంస్మరణను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్‌పోస్టర్‌ను వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆదివారం ఆవి ష్కరించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గద్దర్ సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభను ప్రజలు విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జై భీం పార్టీ నాయకులు జె.విజయ్ కుమార్ , దళిత మహాసభ రాష్ట్ర నాయకులు కె.బాబురావు ,

విసికె పార్టీ నాయకులు సురే వీరయ్య , న్యాయవాది బుల్లి నాగేశ్వరరావు, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు జె.పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మోడీని సాగనంపాలి

నరసరావుపేట సభలో మాట్లాడుతున్న కె. రామకృష్ణ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా/వినుకొండ

బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందని, నరేంద్ర మోడీ అసమర్థ ప్రధాని అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ,అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ చైతన్య పరిచేందుకు సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం నరసరావు పేట, వినుకొండలకు చేరుకుంది. నరసరావుపేట వచ్చిన బస్సు యాత్రకు సిపిఐ పల్నాడు జిల్లా కమిటీ ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా నరసరావుపేటలోని జమీ ందారి ఫంక్షన్ హాల్ లో, వినుకొండలోని శివయ్య స్తూపం వద్ద జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేంద్రంలో మరోసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం లోకొస్తే లౌకిక రాజ్యాన్ని కాలరాసి, మనుస్మృతి ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించి అమలు చేస్తారని విమర్శించారు. బ్యాంకులకు వేలకోట్లు అప్పులు ఎగ్గొట్టిన విజయ్ మాల్యా లాంటివారికి మోడీ తొత్తుగా మారాడని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం జగన్మోహన్ రెడ్డి ఒక అరాచక శక్తి అని, మతోన్మాద మోడీకి దత్తపుత్రుడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పోలీసులు అధికార పార్టీకి సలాం కొడుతూ రక్షణను మరిచారని విమర్శించారు. ముందస్తు ఎన్నికలను సిపిఐ స్వాగతిస్తుందని స్పష్టం చేశారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేదల ఇళ్లకు తాగునీరు సరఫరా, కరెంటు సరఫరాను కట్ చేయించి దుర్మార్గానికి పాల్పడుతున్నారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడు రాష్ట్రంలో కష్టజీవులకు కూడా పెన్షన్ గ్యారెంటీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథ కాలు అందాలని, 60 ఏళ్లు పైబడిన వారందరిని రాష్ట్ర ప్రభు త్వం ఆదుకోవాలన్నారు. బస్సు యాత్ర ముగింపు సంద ర్భంగా తిరుపతిలో నిర్వహించే సదస్సులో వద్ధులైన పెన్షన్‌దారుల కోసం, వారి సంక్షేమం కోసం తీర్మానాలు చేసి, పోరాటాలు చేస్తా మన్నారు. సిపిఐ 5 డిమాండ్లను ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేస్తుందన్నారు. రానున్న రోజుల్లో సంక్షేమ పెన్షన్ దారులను సమీకరించి ప్రభుత్వంపై యుద్ధం చేస్తా మన్నారు. కార్యక్రమంలో సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు అక్కినేని వనిజ, జంగాల అజయ్ కుమార్, సువర్ణ, మారుతి వరప్రసాద్ వై.చెంచయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ప్రజాశక్తి-రెంటచింతల

గహ ఉపయోగ, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి సర్వీసు ఎవరి పేరున వుంటే వారి ఆధార నెంబరు మాత్రమే సర్వీస్ నెంబరు కు లింక్ అయి ఉండేలా చూసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ మస్తాన్ వలి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు సర్వీస్ నెంబర్ కు ఆధార్ నంబర్ లింక్ చేసుకోవాలంటే, ఏపీ ఈపీ డీసీఎల్ వెబ్ సైట్ లో గాని, బిల్ కలెక్టర్, రెవెన్యూ క్యాషియర్, వద్ద గ్రామ సచి వాలయాల్లో గాని తప్పనిసరిగా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. నూతన మీటర్ల కోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రైతులు ఖర్చులు తగ్గించుకోవచ్చు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తూ రైతులు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు,ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించేందుకు ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని దిమాటిక్ లీడర్ చక్రవర్తి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కాకతీయ నగర్ లో గల ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో అమల కుమారి మాట్లాడుతూ ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ భాగస్వామ్యంతో 4 రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడ రోజు రైతుల సంక్షోభాల గురించి వివరించారు.

పిడుగురాళ్ల లైన్స్ క్లబ్ (అక్షయ) ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

లయన్స్ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల (అక్షయ) 2023-24 సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం పట్టణంలోని స్థానిక శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త చిన్న సుబ్బారావు హాజరయ్యారు.క్లబ్ ఇమీడియట్ ఫాస్ట్ ప్రెసిడెంట్ తంగుటూరి వెంకట సతీష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. నూతన కార్యవర్గం నందు అధ్యక్షులుగా గుండా నారాయణరావు, కార్యదర్శిగా ఆవుల జనార్ధన రావు, కోశాధికారిగా కోడూరు కాశి శంకర్ తదితర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ సీనియర్ సభ్యులు వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీ సాయి వృద్ధాశ్రమం అభివృద్ధి నిమిత్తం రూ. 50,000 నగదు, ఫ్యాన్లు బహుకరించారు.

400 మందికి ఎముకల సాంద్రత పరీక్షలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

నాలుగు వందల మందికి ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు శ్రీ వివేకానంద విద్యా నికేతన్ హై స్కూల్ ప్రిన్సిపాల్ నందూరి శిరీష తెలిపారు. ఆదివారం మండలంలోని తాళ్లూరు గ్రామంలో శ్రీ వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఉచిత ఆర్థోపెడిక్ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకలు, కీళ్ళు పరీక్షలకు విజయవాడకు చెందిన ఎంజే నాయుడు హాస్పిటల్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్ శర్మ ఆధ్వర్యంలో స్పెషలిస్టులు నాయుడు, రవితేజ, వంశీకష్ణ, నాగేశ్వరరావు, జ్యోతి రోగులకు వైద్య సేవలు అందించారు.

మోటార్ల చోరీలతో రైతులు బెంబేలు

- ఒకే రోజు ఐదు అపహరణ
- మూణ్ణెల్లలో ఇది రెండోసారి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఒకే రోజు, ఒకే ప్రాంతంలో 5 వ్యవసాయ మోటార్లను దుండగలు శనివారంరాత్రి అపహరించారు. ఇలా మోటార్లు చోరీకి గురికావడం గత మూణ్ణెల్లలో ఇది రెండోసారి. కుంచనపల్లి పొలాల్లో విద్యుత్ మోటర్లు వరుసగా చోరీకి గురవడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన అమ్మిశెట్టి సుబ్బారావు, బొడ్డు ప్రసాద్, అమ్మిశెట్టి శివనాగేశ్వరరావు, అమ్మిశెట్టి అర్జున్, కుక్కమల్ల శామ్యూల్ అనే రైతుల పొలాల్లోని మోటార్లు అపహరణకు గురయ్యాయి. ఆదివారం ఉదయం గమనించిన రైతులు తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కో మోటారు ఖరీదు రూ.50 వేలకు పైబడే ఉంటుందని రైతులు వాపోతున్నారు. అసలే వ్యవసాయ పెట్టుబడులు పెరిగి అనేక ఇబ్బందులు పడుతున్న తమకు వ్యవసాయ విద్యుత్ మోటర్లు మళ్లీ కొనుక్కునే ఆర్థిక స్తోమత లేదని ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ మోటర్ల చోరీ విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి తాడేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న రైతులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతుల వ్యవసాయ విద్యుత్ మోటర్లు అపహరణకు గురికావడం బాధాకరమన్నారు. పంటలకు సరైన సమయంలో నీరు అందించకపోతే పైర్లు ఎండిపోయి, రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. పెనుమాక గ్రామ పరిసర ప్రాంతాల్లో 20 మోటార్లు అపహరణకు గురయ్యాయని, పోలీసులు సత్వరమే స్పందించి చోరీలకు అడ్డుకట్ట వేయాలని సిఐ శేషగిరిరావును కోరారు.

మోటారు చోరీకి గురైన ప్రాంతం

బాల గణపతి ఉత్సవ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ బాల గణపతి ఉత్సవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పాత మంగళగిరి జిఆర్ స్కూల్ సెంటర్లో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బి శ్రీనివాసరావు, కన్వీనర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు, నందం అబద్దయ్య, బి.లక్ష్మణరావు, ఎం.రాము, ఆర్.దుర్గారావు పాల్గొన్నారు.

జెఎంజె మహిళా కళాశాలలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక జెఎంజె మహిళా కళాశాలలో ఆదివారం విద్యార్థినులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తెనాలి ఐఎంఎ మిషన్ పింక్, హ్యాపీ హాస్పిటల్, రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ షైనీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్య బృందం మాట్లాడుతూ రక్తహీనత సమస్య ఎదురుకాకుండా విద్యార్థినులు జాగ్రత్త తీసుకోవాలన్నారు. యుక్తవయసులో ఎదురయ్యే వివిధ రకాల ఆరోగ్య సమస్యలు, నియంత్రణ విధానాలను వివరించారు. శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ శ్వేత, డాక్టర్ లావణ్య, డాక్టర్ ఉష వైద్య సేవలందించి రక్తహీనతకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దుర్గారాణి, హ్యాపీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పవని ప్రియాంక, రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ ముమ్మనేని భానుమతి, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పి.హేమలత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత, ఉమెన్ డెవలప్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ సరోజిని, సిస్టర్ ఎమిలీ, డాక్టర్ అమూల్ మేరీ పాల్గొన్నారు.

విద్యార్థినులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య బృందం

సంకల్పం, చిత్తశుద్ధే ఆయుధంగా

- పెండింగ్ సమస్యల పరిష్కార వేదికగా 'ప్రజల వద్దకు తహశీల్దార్'
- రెండు నెలల్లో 12వేల అర్జీలకు పరిష్కారం చూపిన చేబ్రోలు తహశీల్దార్

ప్రజాశక్తి-తెనాలి/చేబ్రోలు

వృత్తిపట్ల అంకిత భావం, ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి, వాటిని పరిష్కరించాలన్న సంకల్పం.. ఇవే ఆయన ఆయుధాలు. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి అలిసిపోయిన వారికి ఓ దిక్సూచిగా నిలిచారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వేల సమస్యలకు కేవలం రెండు నెలల్లోనే పరిష్కారం చూపారు. పనిచేసిన ప్రతిచోటా తనదైన ముద్రవేసుకుంటూ వరుసగా 17 సార్లు ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా పురస్కారాలను చేబ్రోలు తహశీల్దార్ కోటంరాజు వెంకట గోపాలకృష్ణ అందుకున్నారు.

వెంకట గోపాలకృష్ణ 2003లో రెవెన్యూ శాఖలో చిన్న ఉద్యోగిగా మొదలైన ఆయన ప్రస్థానం సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దార్‌గా ప్రమోషన్ పొందారు. తొలిగా బాపట్లలో పనిచేశారు. అప్పటి డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి నుంచి సమర్ధవంతమైన అధికారిగా పలు వేదికలపై మన్ననలనూ అందుకున్నారు. ఈ ఏడాది జూన్ 15న చేబ్రోలు తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. శాఖా పరంగా కుప్పలు కుప్పలుగా పేరుకుపోయిన సమస్యలు ఆయనను ఉక్కిరిబిక్కిరి చేశాయి. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణలు, పేదరికం ధ్రువీకరణ, ఓటిఎస్, శ్మశానాలకు స్థలాల కేటాయింపు వంటి అనేక అర్జీలు దాదాపు 12 వేలకు పైగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించి పరిష్కారానికి నడుం బిగించారు.

తహశీల్దార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరోశయ్య

ప్రజల వద్దకు తహశీల్దార్

'ప్రజల వద్దకు తహశీల్దార్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఒక్కో గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరించారు. పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం కార్యాలయం చుట్టూ తిరిగి అలిసిపోయిన రైతులకు ఊరట కలిగించారు. గొడవర్రులో కాల్వకు సంబంధించిన ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపి తూములను ఏర్పాటు చేయించారు. సుద్దపల్లిలో కాల్వ సమస్యనూ పరిష్కరించారు. వీటన్నింటినీ మించి శేకూరులో ముస్లిముల శ్మశాన వాటికకు స్థలం కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తుండగా వారికి ఐదు సెంట్లు కేటాయించారు. శేకూరుపాలెంలో ఎస్సీలకు మరో 20 సెంట్లను కేటాయించారు.

వరుసగా 17 సార్లు ఉత్తమ సేవా పురస్కారం

విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తున్న కె.వి గోపాలకృష్ణ ఇప్పటికి వరుసగా 17 సార్లు ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 2003 నుంచి ఇప్పటి వరకూ వివిద హోదాల్లో 16 సార్లు ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్న గోపాలకృష్ణ, తహశీల్దార్ హోదాలో ఈ ఏడాది 17వసారి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి నుండి ప్రశంసాపత్రం అందుకున్నారు. తహశీల్దార్ పరితీరుపై ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ప్రశంసల జల్లు కురింపించి సత్కరించారు.

పేదల సమస్యల పరిష్కారమే అజెండాగా పని

నిత్యం మా కార్యాలయానికి సందర్శకుల తాకిడి ఉంటుంది. వారిలో అధిక శాతం పేదలు, రైతులే ఉంటారు. ఉద్యోగులుగా వారి సమస్యలకు పరిష్కారం చూపటం మా బాధ్యత. నేను బాధ్యతలు స్వీకరించే నాటికి దాదాపు 12 వేలకు పైగా అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పురోగతి కనుగొనే నిమిత్తం వచ్చే సందర్శకులు ఎంతో నిరాశావాదంలో మాట్లాడేవారు. దీర్ఘకాలికంగా తిరుగుతున్నా పరిష్కరించలేదని నిట్టూర్చేవారు. దీంతో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్న సంకల్పంతో ప్రజల వద్దకు తహశీల్దార్ కార్యక్రమం ద్వారా ప్రజలకు భరోసా కల్పించాం. మా పరిధిలో పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాం. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తాం.

కె.వి.గోపాలకృష్ణ, తహశీల్దార్, చేబ్రోలు.

ఏళ్ల తరబడి నిరీక్షణకు పరిష్కారం

పాలేటి వెంకటేశ్వర్లు, రైతు, జె.లక్ష్మీప్రసన్న, విఆర్‌ఎ

శేకూరులో ఉన్న మా పొలం సమస్యపై ఐదేళ్లుగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. కొత్తగా వచ్చిన తహశీల్దార్ గోపాలకృష్ణ ఆ సమస్యను పరిశీలించి, విఆర్వోతో మాట్లాడి పరిష్కరించారు.

మా నాన్న విఆర్‌ఎగా పనిచేస్తూ చనిపోయారు. కారుణ్య నియామకం కోసం రెండేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. గోపాలకృష్ణ తహశీల్దార్‌గా వచ్చిన తరువాత కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి విఆర్‌ఎగా ఉత్తర్వులు ఇప్పించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

నూర్‌బాషా సంఘీయుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కొత్తపేట రాధాకృష్ణ కళ్యాణ మండపంలో మైనారిటీ దూదేకుల నూర్‌బాషా సంఘీయుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమానికి టిడిపి కట్టుబడి ఉందన్నారు. టిడిపి ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలను వివరించారు పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం టిడిపికి ప్రజలు అండగా నిలవాలని, రానున్న ఎన్నికలలో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నూర్‌బాషా సంఘ నాయకులు శేషావలి, సాహెబ్ ఉమర్, షేక్ చిన మస్తాన్, షేక్ జాన్ సైదా, షేక్ దాదావలి, షేక్ బాబావలి, షేక్ నబి, షేక్ పీర్, షేక్ జానయ్య పాల్గొన్నారు.

మాతృసేవ సంక్షేమ సంఘం అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద అనాథలకు మాతృ సేవాసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. సంఘం అధ్యక్షులు, ఎల్.శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకట నరసయ్య, కార్యదర్శి పి.పూర్ణచంద్రరావు, కోశాధికారి వై.శివనాగేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, కృష్ణమ్మ, శివమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు చెక్క బండ్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని టిట్కో గృహ సముదాయంలోని చిరు వ్యాపారులైన వీరేష్, షేక్ షహనాబ్‌లకు చెక్కబడ్లను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సమకూర్చారు. వీటిని వైసిపి నాయకులు ఎమ్‌డి ఫిరోజ్ తదితరులు ఆదివారం అందించారు.

గుండెపోటుతో పాస్టర్ పుల్లారావు మృతి

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని డొకిపర్రు శాంతిపాలేనికి చెందిన పాస్టర్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. లెమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ ఇంటర్నేషనల్ చర్చిలో పాస్టర్‌గా పని చేస్తున్న గంగవరపు పుల్లారావు(50) చిర్చిలో ఆదివారం వ్యాకం చెప్పిన తర్వాత ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పుల్లారావు స్వస్థలం చేబ్రోలు మండలం చెరువులోపాలెం కాగా కొన్నేళ్లుగా శాంతిపాలెంలో పని పాస్టర్‌గా పరిచర్య చేస్తున్నారు. ఆయనుకు డోకిపర్రు సర్పంచ్ కె.సామ్రాజ్యం నివాళులర్పించారు.

రుమేనియాలో పతకం అందుకుంటున్న షబీనా (మధ్యలో)

పవర్ లిఫ్టింగ్‌లో మెరిసిన షబీనా

ప్రజాశక్తి-తెనాలి, మంగళగిరి

రుమేనియా దేశంలో ఈనెల 24 నుండి ప్రారంభమైన ప్రపంచ సబ్ జూనియర్, జూనియర్ అండ్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి పట్టణానికి చెందిన షేక్ షబీనా సత్తా చాటారు. గోల్డ్ మెడల్ సాధించి తెనాలి కీర్తిని ఇనుమడింపజేశారు. ఇప్పటికే పవర్ లిఫ్టింగ్‌లో పలు పతకాలను సాధించిన షేక్ షబీనా, ఈనెల 24 నుంచి రుమేనియాలో జరుగుతున్న ప్రపంచ సబ్ జూనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్‌లో శనివారం రాత్రి జరిగిన పోటీల్లో 84 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించినట్లు కోచ్ షేక్ సంధాని తెలిపారు. బెంచ్ ప్రెస్‌లో 4వస్థానం, డెడ్ లిఫ్ట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించి రాష్ట్రానికే తలమానికంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమెను సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.కోటేశ్వరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎం.ప్రభాకర్, కార్యదర్శి ఎస్.సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు కె.విజయ భాస్కర్‌రావు అభినందనలు తెలిపారు. షబీనా మంగళగిరి ఫిట్‌జోన్ సెంటర్‌లో శిక్షణ పొందతున్నారు.

ఫుట్‌బాల్ పల్నాడు జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పట్టణంలోని సుగాలీ కాలనీ జెడ్‌పి పాఠశాలలో పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక చేపట్టారు. పల్నాడు జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎంపికలో జిల్లా నలుమూలలు నుండి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కొమెరపూడి జెడ్‌పి పాఠశాల పిడి ఎ.శ్రీరామ్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ, సీనియర్ ఉపాధ్యాయులు ఐ.ఎస్ నాగిరెడ్డి, పిఇటిలు శ్రీనివాసరావు రియాజు, అచ్చిరెడ్డి, కమలాకర్, నరసింహారావు, జాన్ సైదా నూరుల్లా, సురేష్ పాల్గొన్నారు.

జగన్న లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలి

అధికారులతో మేయర్ సమీక్ష

నేడు రెండు ప్రాంతాల్లో పరిశీలనకు..

ప్రజాశక్తి - గుంటూరు

జగనన్న లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆదేశించారు. అనంతవరప్పాడు, కొర్నెపాడు లే ఔట్లల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ ఆదివారం తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. మౌలిక సదుపాయాల కల్పన త్వరితగతిన పూర్తి చేస్తేనే ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదార్లు ఆసక్తి చూపుతారని చెప్పారు. ప్రతి ఒక్కరికీ స్వంత ఇళ్లు ఉండాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందన్నారు. లే ఔట్లలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, అవసరం ఉంటే విద్యుత్ శాఖ అధికారులకు తెలియచేయాలని చెప్పారు. లే అవుట్లలో తాను సోమవారం పరిశీలిస్తానని చెప్పారు. లబ్ధిధార్లు సైతం గృహ నిర్మాణానికి ముందుకు రావాలని సూచించారు. ఇందుకు సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలో వాలంటీర్లతో కలిసి లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, డిఈఈలు, ఎఈలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నగరంలోని శ్రీ శ్రీ శ్రీ చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానం నందు పొంగళ్ళు సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు మద్దాలి గిరిధర్‌తో కలిసి మేయర్ పాల్గొన్నారు. దేవస్థానం వద్ద గల చెరువు ట్రాక్ మొత్తం ఆధునిక హంగులతో ఆధునీకరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆడక పద్మావతి, సాదు ఉమామహేశ్వరి రాజేష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

లే అవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మేయర్ మనోహర్‌నాయుడు

ఆ తాగునీటిని చూస్తే భయం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని మున్సిపల్ జోనల్ కార్యాలయం నుంచి కొండ చుట్టూ తిరిగి కార్యాలయం వరకు మున్సిపల్ ట్యాపుల నుంచి మురికినీరు వస్తోంది. పంపు తిప్పగానే రెండు మూడు బకెట్లు నురగతో కూడిన మురుగునీరు వస్తుడటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సిఎం నివాసానికి కూత వేటు దూరంలో ఈ పరిస్థితి తలెత్తడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక్కపక్క మెయిన్ రోడ్డు వెంట గత నెల రోజుల నుంచి పైపులైన్ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. అంతకు ముందు కూడా ఇలాగే మురుగునీరు వచ్చాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని మురుగునీటిని అరికట్టి మంచినీరు వచ్చేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల



మండల కేంద్రమైన నాదెండ్లలో నాలుగు రోజులుగా తాగునీరు ఆకుపచ్చ రంగులో వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక బరోడా బ్యాంక్ ప్రాంతంలో ఈ నీరు ఇలా వస్తున్నాయని, అధికారులను అడిగినా సరైన సమాధానం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

విద్యుత్ భారం.. సోలార్‌తో దూరం

సోలార్ విద్యుత్ ప్లాంట్లు కార్యాలయాలు, ఇళ్లల్లో కూడా అమర్చుకోవచ్చునని సంప్రదాయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్) ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ ఎస్.యర్రంరెడ్డి తెలిపారు. సాధారణ విద్యుత్ ఛార్జీల కంటే తక్కువ ధరలకు సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవచ్చునని చెప్పారు. ఒక్కసారి పెట్టుబడి పెట్టి కనెక్షన్లు తీసుకుంటే 30 ఏళ్లపాటు వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలియజేశారు.

- **సొమ్ముచెల్లించిన వెంటనే కనెక్షన్లు**
- **ప్రజాశక్తితో నెడ్ క్యాప్ జిఎం యర్రంరెడ్డి**

ఇళ్లకు సోలార్ కనెక్షన్లు ఎలా పొందాలి?

పెద్ద నివాస భవనాలకు ఐదు కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటుకు నెడ్ క్యాప్ సంస్థకు రూ.3.62 లక్షలు చెల్లించాలి. చిన్న నివాస భవనాలకు 3 కిలోవాట్ల ప్లాంట్‌కు రూ.2.29 లక్షలు చెల్లించాల్సి ఉంది. డిడి రూపంలో ఈ సొమ్ము చెల్లిస్తే ప్యానల్స్‌ను మేమే ఏర్పాటు చేస్తాం. సోలార్ కనెక్షన్లు ఇస్తామని కొంత మంది ప్రైవేటు వ్యాపారుల ముసుగులో మోసాలు కూడా చేస్తున్నారు. వీరి పట్ల అప్రమత్తతో ఉండాలి. విద్యుత్ ఛార్జీల భారం నుంచి ఉపశమనం పొందేందుకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలి.

ఏ తరగతుల వారికి సోలార్ కనెక్షన్లు ఉన్నాయి?

చాలా వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేశాం. గుంటూరులో ఇప్పటికే ట్రాఫిక్ సిగ్నల్స్‌కు, కలెక్టరేట్, నగరపాలక సంస్థ, ఇతర కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. కలెక్టరేట్‌లో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన ప్లాంటు 80 కిలో వాట్ల సామర్థ్యంతో ప్లాంటు పని చేస్తుంది. ఈ ప్లాంటు 30 ఏళ్లపాటు పనిచేస్తుంది. కొంతమంది వైద్యులు తమ ఆస్పత్రుల్లో ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. సంగంజాగర్లమూడి వద్ద కార్పొరేషన్ వాటర్‌వర్క్సుకు కూడా సోలార్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేశాం. ఇప్పటికే కొంత మంది ఇళ్లకు కూడా సోలార్ కనెక్షన్లు తీసుకున్నారు.

సోలార్ బల్బుల తయారీ ఇప్పుడుందా?

ఎల్ఇడి బల్బులు తయారు చేస్తున్నారు. 2014 నుంచి 2018 మధ్య ప్రతి ఇంటికి ఎల్ఇడి బల్బులు పంపిణీ జరిగింది. ప్రస్తుతం మంగళగిరి కార్పొరేషన్ సెంట్రల్ లైటింగ్‌కు అవసరమయ్యే బల్బులు మేమే సరఫరాచేశాం. బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీలకు కూడా సోలార్ కనెక్షన్లతోనే వీధి దీపాలు కూడా అమర్చాం.

బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రాలు పని చేస్తున్నాయా?

పిడుగురాళ్ల మున్సిపాల్టీలో కూరగాయల వ్యర్థాలతో బయోగ్యాస్ తయారు చేసే ప్లాంటు నెలకొల్పాం. 14 కిలోల సామర్థ్యం కలిగిన 50 సిలిండర్ల గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నాం. త్వరలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కూడా బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నాం.

ప్లాంట్లు ఏర్పాటుకు తగినంత సిబ్బంది ఉన్నారా?

సోలార్ విద్యుత్, బయోగ్యాస్ ఉత్పత్తికి 1200 మంది నిరుద్యోగులకు 9 బ్యాచ్‌లలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇటీవల శిక్షణిచ్చాం. ఐటిఐ, ఎలక్ట్రికల్ డిప్లొమా అర్హత కలిగిన వారు శిక్షణ పొందారు. వీరికి ప్రస్తుతం రూ.25వేల వరకు జీతం వస్తుంది.

విద్యుత్ వాహనాలకు ఛార్జింగ్ యూనిట్లు ఉన్నాయా?

జిల్లాలోని అన్ని పట్టణాల్లో ఛార్జింగ్ యూనిట్లు ఉన్నాయి. ప్రస్తుతం విద్యుత్ ద్విచక్ర వాహనాలకు డిమాండ్ ఉంది. విద్యుత్ వాహనాల కొనుగోలు కూడా వేగంగానే జరుగుతోంది.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఓపిఎస్ సాధన కోసం ఒకటిన నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్దరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న ధర్మ పోరాట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపిసిపిఎస్‌యుఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుమలరెడ్డి, దయానంద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని వాగ్దానం చేసి, అధికారం చేపట్టి నాలుగేళ్లవుతున్నా హామీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. 2019లో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి క్యాబినెట్ సమావేశంలోనే సిపిఎస్ రద్దు అంశాన్ని ఆమోదించారని, కానీ ఇప్పటి వరకూ కమిటీలతో కాలయాపన చేసి, గ్యారెంటీ లేని గ్యారెంటీ పెన్షన్ ఇస్తామని సిపిఎస్ ఉద్యోగుల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 1న జరిగే ధర్మ పోరాట నిరసనలో సిపిఎస్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 29న ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిపిఎస్ సమావేశాన్ని కూడా అన్ని జెఎసిలు, ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించి, ప్రభుత్వానికి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

అంత్యక్రియలకు మన్నవ మోహనకృష్ణ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుంటూరు

నివాళులర్పిస్తున్న మోహనకృష్ణ

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 22వ డివిజన్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త మిర్చియార్డు జయమ్మ మృతికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఎన్‌టిఆర్ ట్రస్ట్ డైరెక్టర్ మన్నవ మోహనకృష్ణ సంతాపం తెలిపారు. ఆదివారం ఆమె భౌతిక ఖాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందించారు.